క్లుప్తంగా

సూర్యప్రభ వాహనంపై లక్ష్మీనారాయణుడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు సూర్య ప్రభ వాహనంపై పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణస్వామి వారికి ఆస్థాన మండపంలో ప్రధాన అర్చకులు మాధవన్ దాశరథి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య తిరుమంజనం సేవ నిర్వహించారు. అలాగే సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై నుంచి స్వామివారు భక్తులను కటాక్షించారు. ఆలయ ట్రస్టీ శ్రీధర్ సుమిత్ర దంపతులు, అడ్వొకేట్ వాసు, మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి 'జగనన్నకు చెబుదాం' రద్దు

పుత్తూరు రూరల్: స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద గల కార్తీక్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎంపీడీఓ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం కారణంగా వాయిదా వేసినట్లు జిల్లా అధికారులు ప్రకటించినట్లు వెల్లడించారు. తదుపరి కార్యక్రమం తేదీని తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

వృద్ధాశ్రమానికి రూ.75 వేలు విరాళం



వృద్ధాశ్రమ ప్రతినిధులకు చెక్కును అందిస్తున్న దాతలు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం అభివృద్ధికి యూఎస్ఏలోని రాయలసీమ అసోసియేషన్(ధారా) వారు రూ.75 వేల చెక్కును గురువారం రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్‌కు అందించారు. ఈ సందర్భంగా ధారా అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వద్ధాశ్రమం అభివృద్ధికి ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. సర్పంచ్ ధనుంజయవర్మ మాట్లాడుతూ వృద్ధాశ్రమం అభివృద్ధికి రూ.75 వేలు అందించడం అభినందనీయమన్నారు. హేమశేఖర్‌రెడ్డి, మార్కొండయ్య, దశరథరెడ్డి, మోహన్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

ధరణి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కార్వేటినగరం: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతనంగా ప్రవేశపెట్టిన ధరణి డిపాజిట్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంకు మేనేజర్ వహిద అన్నారు. గురువారం డీసీసీ బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ధరణి డిపాజిట్ పథకం ద్వారా సీనియర్ సిటిజన్లకు 8.50 శాతం అదనపు వడ్డీ సౌకర్యం, డిపాజిట్లకు డీసీసీ బ్యాంకులో ఇన్సూరెన్సు సౌకర్యం ఉందన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేయడం వల్ల వాణిజ్య బ్యాంకుల కన్నా అధిక వడ్డీ పొందవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా గుణశేఖర్ రెడ్డి



నింద్ర: భారతీయ జనతా పార్టీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా గుణశేఖర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈయన నింద్రకు చెందిన పార్టీ నాయకులు, గతంలో మండల పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. గురువారం జిల్లా పార్టీ కమిటీ గుణశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాస్థాయి పదవి అప్పజెప్పిన నాయకులకు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని గుణశేఖర్‌రెడ్డి అన్నారు.

22న మహతిలో బహురూప కళా విన్యాసం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహతి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నారాయణతే నమో నమో సంకీర్తన బహురూప కళా విన్యాస ప్రదర్శన చేపడుతున్నట్లు మృదంగ విద్వాంసుడు పీఎస్‌పీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వినూత్న రీతిలో నారాయణతే నమో నమో అన్నమయ్య సంకీర్తనను ఒకే వేదికపై విభిన్న రాగాలలో 13 కళారూపాల ద్వారా 65 మంది కళాకారులతో ఈ మహోత్తర కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కళాకారుడు కె.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కార్వేటినగరం: గాయత్రీదేవిగా శ్రీబంగారమ్మ, గంగాధరనెల్లూరు: అర్ధనారీశ్వరి అలంకరణలో అల్లియల్లమ్మ, పుత్తూరు ఆరేటమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో మంత్రి రోజా





నగరి: దుర్గాదేవిగా దేశమ్మ, సరస్వతీదేవిగా కామాక్షీదేవి




జననేత్రి.. దివ్యధాత్రి..

నగరి : నియోజకవర్గవ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు వివిధ అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం బైపాస్ కూడలిలోని ఓంశక్తి ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించగా మంత్రి ఆర్‌కే రోజా, ఆమె సోదరుడు రామ్ ప్రసాద్‌రెడ్డి పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నగరి మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవికి స్కంధమాత అలంకరణ చేపట్టారు. కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కామాక్షిదేవికి సరస్వతీ అలంకరణ చేశారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గాయత్రి అలంకరణ చేయగా, మూలవర్లకు ముత్యాల అలంకరణ చేశారు. నెత్తంకండ్రిగ కరుమారియమ్మ ఆలయంలో అమ్మవారు కాలరాత్రిదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో వెలసిన అల్లియల్లమ్మ తల్లి ఐదో రోజు అర్ధనారీశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మ వారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

గాయత్రీదేవీ అలంకరణలో శ్రీబంగారమ్మ..

కార్వేటినగరం: దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం శ్రీబంగారమ్మ గాయత్రీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉభయదారులైన నవీన , శ్రీనివాస దినేష్ కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, భక్తులు పాల్గొన్నారు. అలాగే కార్వేటినగరంలోని సంతగేటు సమీపంలో వెలసిన బాటగంగమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణేశ్వరిగా కటాక్షం

పుత్తూరు రూరల్: అన్నపూర్ణేశ్వరి దేవిగా దర్శనమిస్తున్న ఆరేటమ్మ తల్లీ చల్లగా చూడమ్మా అంటూ వేడుకున్నట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. గురువారం రాత్రి పుత్తూరు గ్రామదేవత ఆరేటమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరేటమ్మను అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మంత్రి రోజాను ఆలయ కమిటీ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగలో వెలసిన చెవుటి గంగమ్మ, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పదవేటమ్మ, తమిళనాడు సరిహద్దులో ఉన్న నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజా కన్యకా పరమేశ్వరి సమేత గంగాధరేశ్వర ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులను కటాక్షించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు.



నగరి ఓంశక్తి అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఆర్‌కే రోజా







నగరి: స్కంధమాత అలంకరణలో అన్నపూర్ణదేవి, పాలసముద్రం: సరస్వతీదేవిగా పడవేటమ్మ, గాయత్రీదేవిగా పరమేశ్వరీ సమేత గంగాదేవి, కామాక్షిదేవి అలంకరణలో పరమేశ్వరి దేవి, అలంకరణలో చెవుటి గంగమ్మ

దేశభక్తి మన జీవనాడుల్లో ఉండాలి



వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మట్టిని సేకరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : దేశభక్తి మన జీవనాడుల్లో ఉండాలని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం నగరి పట్టణంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి నామట్టి- నాదేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే ఈ ర్యాలీలో పాల్గొన్న వారికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మినిస్టరీ ఆఫ్ యూత్ అఫైర్స్, క్రీడలు తరఫున నెహ్రూ యువ కేంద్ర చిత్తూరు, బెస్ట్ డెవలప్‌మెంట్ సంఘంవారు, నెహ్రూ యువజన జాతీయ సేవా కార్యకర్త ఎ.విజయ్, ఎం.దీప ఆధ్వర్యంలో బిస్కెట్లు, వాటర్ ప్యాకెట్లు, జెండాలు అందించారు.

పరమేశ్వరరెడ్డి కుటుంబానికి పరామర్శ



నాగమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి పరమేశ్వర రెడ్డి కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి పరామర్శించారు. ఇటీవల పరమేశ్వరరెడ్డి తల్లి నాగమ్మ మృతి చెందగా గురువారం కర్మక్రియలు జరిగాయి. ఈ విషయం తెలిసి మంత్రి నారాయణస్వామి గ్రామానికి చేరుకుని పరమేశ్వర రెడ్డి ఇంటికి వెళ్లి నాగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్, మాజీ సర్పంచ్ గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బస్టాండ్‌లో... 'గరుడోత్సవ' సేవలు

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి గరుడోత్సవం సందర్భంగా తిరుపతి ఏడుకొండల బస్టాండ్‌లో గురువారం ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రధానంగా ఆర్టీసీ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమలకు వెళుతున్న భక్తులకు, ఆర్టీసీ ఉద్యోగులకు పాలు, టీ, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్‌ను తిరుపతి డీపీటీవో చెంగల్‌రెడ్డి, చిత్తూరు డీపీటీవో జితేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కేసీ రెడ్డి, బలరాం, ప్రకాశం ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఎంప్లాయ్ అసోసియేషన్ నేతలు అర్జునయ్య, నరసింహులు, తులసీరెడ్డి, రాంబాబు, మస్తాన్ పాల్గొన్నారు, అంతేకాకుండా తిరుపతి డెప్యూటీ సీటీఎం భాస్కర్, ఏటీఎం రామచంద్రనాయుడు, కార్గో జిల్లా మేనేజర్ సురేంద్రబాబు, డీఎం బాలాజీ, శ్రీకాళహస్తి డీఎం రాజవర్ధన్‌రెడ్డి, మంగళం డీఎం భాస్కర్‌రావు, అసిస్టెంట్ డీఎం నిర్మల తదితరులు హాజరయ్యారు. మరోవైపు ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతృత్వంలో భక్తులకు, ఉద్యోగులకు రొట్టె, పాలు తిరుపతి డీపీటీవో చెంగల్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనందయ్య, జిల్లా అధ్యక్షుడు పరశురాం, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు ఎంవీఎస్ మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పాలు, బిస్కెట్లు పంపిణీ

షాపింగ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన



షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న మంత్రి రోజా, కమిషనర్ వెంకట్రామిరెడ్డి

నగరి: పట్టణంలో శరవేగంగా జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులను గురువారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ నగరి పట్టణ ప్రజల చిరకాల స్వప్నమైన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రూ.2.30 కోట్లతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం 31 గదుల నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి, చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్



నగరి: మండలంలోని ముడిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా విక్రయిస్తున్న ఎం.కుమరేశ్(32) అనే వ్యక్తిని సెబ్ సీఐ వర్ధనాదేవి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్ఐ భానుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ వైద్యం



కంటి అద్దాలు అందజేస్తున్న తహసీల్దార్ ఇన్బనాథన్

గంగాధర నెల్లూరు: మండలంలోని పాతవెంకటాపురం గ్రామంలో గురువారం సర్పంచ్ ఆర్.సెల్విరాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తహసీల్దార్ ఇన్బనాథన్ ప్రారంభించారు. స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లారెన్స్, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడితే గెలుపు మనదే



సమావేశంలో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

- గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో కృపాలక్ష్మి



సమావేశంలో పాల్గొన్న గృహసారథులు, కన్వీనర్లు

పాలసముద్రం : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే ప్రజాప్రతినిధులతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కష్టపడి పని చేస్తే చాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. గురువారం పాలసముద్రం ఉన్నత పాఠశాల ఆవరణలో మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులకు సమావేశం నిర్వహించారు. విచ్చేసిన డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పార్టీ అధికారంలోకి రావడం కోసం కష్టపడి కార్యకర్త, నాయకుడు పని చేశారన్నారు. మళ్లీ అధికారంలోకి రావాలంటే ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలోని హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరిగిందన్నారు. త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ పోలయ్య, మాజీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీటీసీ గోవిందరాజు, లిఖిత, నాయకులు పుత్తూరు కేశవరెడ్డి, వేణు, విజయరాఘవరెడ్డి, సర్పంచులు అయ్యప్ప, మహేష్, త్యాగరాజు, అరుల్, కుట్టి, చిన్నపయ్యన్, రవిరెడ్డి, లక్ష్మిపతి, మునస్వామి నాయుడు, షణ్ముగరెడ్డి, చంద్రశేఖర్‌రాజు, వరదరాజు, ప్రకాష్, చలపతి, నరసింహనాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

24 గంటల్లోనే సమస్య పరిష్కారం



కంటి కలక సోకిన వారి కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీలోని కట్టకింద రామకృష్ణాపురం గ్రామస్తుల సమస్యను మంత్రి రోజా 24 గంటల్లోనే పరిష్కరించారు. తమ గ్రామంలో కళ్లకలక (మద్రాసు ఐ) వ్యాప్తి చెంది ఇబ్బంది పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన మంత్రి ఆర్‌కే రోజాను గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి రోజా జిల్లా వైద్యాధికారులతో మాట్లాడి గురువారం అదే గ్రామంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. ఈ శిబిరంలో కంటి వెలుగు డీపీఓ మధుబాబు ఆధ్వర్యంలో డాక్టర్లు కిరణ్‌నాయక్, కీర్తిప్రియ, రామాంజనేయులురెడ్డి, రమేష్, స్వాతి బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 92 మందికి పరీక్షలు నిర్వహించి, కంటి చుక్కల మందులను పంపిణీ చేశారు. సమస్య చెప్పగానే తక్షణం స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయించిన మంత్రి రోజాకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.